తనీష-అశ్వినికి డబుల్స్ టైటిల్

గువాహటి: భారత మహిళా షట్లర్స్ జోడి అశ్విని పొన్నప్ప, తనీష క్రాస్టా గౌహతి మాస్టర్స్ సూపర్-100 టైటిల్‌ను గెలుచుకున్నారు. ఆదివారం జరిగిన మహిళల డబుల్స్ ఫైనల్లో రెండో సీడ్ అశ్విని-తనీష 21-13, 21-19 స్కోరుతో 81వ ర్యాంక్ జోడి చైనీస్ తైపీకి చెందిన సంగ్ షో యున్-యు చీన్ హల్‌లపై 40 నిమిషాలలో విజయం సాధించారు. ఈ యేడాది ఈ జోడీకి ఇది మూడో టైటిల్. అంతకుముందు అబుధాబి మాస్టర్స్ సూపర్-100, నాన్‌టెస్ ఇంటర్నేషనల్ చాలెంజ్ టోర్నీలలో టైటిల్స్ సాధించారు.

జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో ఉప్పల శ్రీరామ్, శ్రేయ విజేతలుగా నిలిచారు. ఆదివారం సికింద్రాబాద్‌లో జరిగిన టోర్నీ ముగింపు కార్యక్రమంలో విజేతలకు నిర్వాహకులు ట్రోఫీలు అందజేశారు.

ఈ నెల 15 నుంచి చెన్నై వేదికగా జరుగనున్న రోలర్ స్కేటింగ్ జాతీయ పోటీల్లో పాల్గొననున్న తెలంగాణ జట్టు.

ఓదార్పు విజయం

చివరి టీ20లో భారత అమ్మాయిల గెలుపు

2-1తో సిరీస్ చేజిక్కించుకున్న ఇంగ్లండ్

గత రెండు మ్యాచ్‌ల్లో పెద్దగా ప్రభావం చూపలేక.. సిరీస్ కోల్పోయిన భారత మహిళల జట్టు నామమాత్రమైన చివరి టీ20లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. మొదట బౌలర్లు సమిష్టిగా సత్తాచాటి ప్రత్యర్థిని తక్కువ స్కోరుకే కట్టడి చేయగా.. ఆనక స్మృతి మంధన రాణించడంతో టీమ్‌ఇండియా అలవోకగా విజయం సాధించింది.

శ్రేయాంక (3/19)

ముంబై: ఇంగ్లండ్ చేతిలో సిరీస్ కోల్పోయిన భారత మహిళల జట్టు.. ఓదార్పు విజయం సాధించింది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఆదివారం జరిగిన పోరులో టీమ్‌ఇండియా 5 వికెట్ల తేడాతో ఇంగ్లిష్ జట్టును చిత్తు చేసింది. దీంతో ఇంగ్లండ్ 2-1తో సిరీస్ కైవసం చేసుకుంది. గత రెండు మ్యాచ్‌ల్లో ఆకట్టుకోలేక పోయిన భారత్.. ఈ సారి సమిష్టిగా కదం తొక్కింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్.. నిర్ణీత 20 ఓవర్లలో 126 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హీతర్ నైట్ (42 బంతుల్లో 52; 3 ఫోర్లు, 3 సిక్సర్లు) హాఫ్ సెంచరీతో రాణించగా.. అమీ జోన్స్ (25) పర్వాలేదనిపించింది. భారత బౌలర్లలో శ్రేయాంక పాటిల్, సైఖా ఇషాఖ్ చెరో మూడు వికెట్లు పడగొట్టగా.. రేణుక సింగ్, అమన్‌జ్యోత్ కౌర్ రెండేసి వికెట్లు తీశారు. ఒక దశలో 76 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి వందలోపే ఆలౌట్ అయ్యేలా కనిపించిన ఇంగ్లండ్ జట్టును హీతర్ నైట్ ఆదుకుంది.. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగి భారీ షాట్లతో విరుచుకుపడింది. ఫలితంగా ఇంగ్లిష్ జట్టు పోరాడే స్కోరు చేయగలిగింది. ఇక లక్ష్యఛేదనలో భారత్ 19 ఓవర్లలో 5 వికెట్లకు 130 పరుగులు చేసి విజయం సాధించింది. స్టార్ ఓపెనర్ స్మృతి మంధన (48; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా.. జెమీమా రోడ్రిగ్స్ (29; 4 ఫోర్లు) రాణించింది. ఆఖర్లో అమన్‌జ్యోత్ కౌర్ (4 బంతుల్లో 13 నాటౌట్; 3 ఫోర్లు) ఎడాపెడా బౌండ్రీలు బాది గెలుపును సులభతరం చేసింది. ఇంగ్లండ్ బౌలర్లలో కెంప్, ఎకెల్‌స్టోన్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు. చక్కటి బౌలింగ్‌తో మూడు వికెట్లు తీయడంతో పాటు రెండు క్యాచ్‌లు పట్టిన శ్రేయాంక పాటిల్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ స్కీవర్ బ్రంట్ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచింది.

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్: 126 (హీతర్ నైట్ 52; శ్రేయాంక 3/19, సైఖా 3/22), **భారత్:** 19 ఓవర్లలో 130/5 (స్మృతి 48, జెమీమా 29; కెంప్ 2/24).

వర్షార్పణం

భారత్, దక్షిణాఫ్రికా తొలి టీ20 రద్దు



డర్బన్: స్వదేశంలో ఆస్ట్రేలియాపై పొట్టి సిరీస్ నెగ్గిన భారత జట్టు.. అదే ఊపులో దక్షిణాఫ్రికాపై కూడా శుభారంభం చేయాలనుకుంటే.. మ్యాచ్‌కు వరణుడు అడ్డుపడ్డాడు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా డర్బన్ వేదికగా ఆదివారం జరగాల్సిన మొదటి టీ20 ఒక్క బంతి పడకుండానే రద్దైంది. మ్యాచ్ ఆరంభానికి ముందు నుంచే భారీ వర్షం కురువడంతో కనీసం టాస్ వేయడానికి కూడా వీలు పడలేదు. వచ్చే ఏడాది జరగనున్న టీ20 ప్రపంచకప్ సన్నాహకాల్లో భాగంగా పనికొస్తుందనుకున్న ఈ సిరీస్ వర్షంతో ప్రారంభమైంది. మధ్యలో వరణుడు కాస్త తెరిపినివ్వడంతో మ్యాచ్ జరుగుతుందేమో అని ఆశించినా.. తిరిగి వర్షం ముంచెత్తడంతో అభిమానులకు నిరాశ తప్పలేదు. ఇరు జట్ల మధ్య మంగళవారం రెండో మ్యాచ్ జరగనుంది.

యువ భారత్ ఓటమి

దుబాయ్: అండర్-19 ఆసియాకప్‌లో భాగంగా పాకిస్థాన్‌తో జరిగిన పోరులో భారత జట్టు పరాజయం పాలైంది. తొలి పోరులో అఫ్గానిస్థాన్‌పై ఘనవిజయం సాధించిన యువ భారత్ ఆదివారం 8 వికెట్ల తేడాతో పాక్ చేతిలో ఓడింది. మొదట భారత్ 50 ఓవర్లలో 9 వికెట్లకు 259 పరుగులు చేసింది. కెప్టెన్ ఉదయ్ (60), ఆదర్శ్ (62), సచిన్ దాస్ (58) హాఫ్ సెంచరీలు నమోదు చేసుకున్నారు. అనంతరం లక్ష్యఛేదనలో పాకిస్థాన్ 47 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 263 పరుగులు చేసింది. అజాన్ (105 నాటౌట్) సెంచరీతో కదంతొక్కగా.. షాహజాబ్ ఖాన్ (63), సాద్ (68) అర్ధశతకాలు సాధించారు.

హర్యానా గెలుపు

బెంగళూరు : ప్రొ కబడ్డీ లీగ్‌లో ఆదివారం ఉత్కంఠ పోరులో హర్యానా స్టీలర్స్ 35-33 స్కోరుతో దబాంగ్ ఢిల్లీపై గెలుపొందింది. హర్యానా జట్టులో సిద్దార్థ్ 10, ఆశిష్ 7, వినయ్ 5 పాయింట్లు సాధించగా, ఢిల్లీ జట్టులో నవీన్‌కుమార్ అత్యధికంగా 16 పాయింట్లు సాధించినా జట్టును గెలిపించలేకపోయాడు. మరో మ్యాచ్‌లో బెంగాల్ వారియర్స్ 48-38తో తమిళ్ వారియర్స్‌ను ఓడించింది.

మార్చి 2 నుంచి ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్

ఖైరతాబాద్, డిసెంబర్ 10: ఇండియన్ స్ట్రీట్ ప్రీమియర్ లీగ్ (ఐఎస్‌పీఎల్) క్రికెట్ పోటీలను వచ్చే ఏడాది మార్చి 2 నుంచి నిర్వహించనున్నట్లు సెలక్షన్ కమిటీ విభాగాధిపతి జతిన్ పరంజపే తెలిపాడు. హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో క్రికెటర్ ఎస్‌కే ఖమ్రుద్దీన్‌తో కలిసి వివరాలు వెల్లడించారు. దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌కు కొంత భిన్నంగా ఉండే ఈ పోటీలను గ్రేస్ బాల్‌కు బదులు టెన్నీస్ బాల్‌తో నిర్వహిస్తామన్నారు. మిగతా ఫార్మాట్ మొత్తం ఐపీఎల్ మాదిరిగానే ఉంటుందన్నారు. ఈ పోటీల్లో రాణించిన వారికి ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అవకాశాలు లభిస్తాయని తెలిపారు. మాజీ క్రికెటర్ ప్రవీణ్ ఆమ్రే నేతృత్వంలో క్రీడాకారుల ఎంపిక జరుగుతుందన్నారు. వేలం ద్వారా ఒక్కో క్రీడాకారుడికి రూ.3లక్షల నుంచి రూ.50లక్షల ధర పలుకుతుందని చెప్పారు.

జాతీయ సబ్‌జూనియర్ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో 13 పతకాలతో మెరిసిన తెలంగాణ జట్టును హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆదివారం అభినందించారు.

ఈపీఎఫ్ సొమ్మును ఎలా పొందాలి?

ఉద్యోగం వీడినవారు ఏం చేయాలి?



ఎంప్లాయీ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) అనేది ఓ ప్రభుత్వ పథకం. రిటైర్మెంట్ తర్వాత వేతన జీవులకు సామాజిక భద్రత కల్పించడం కోసం ఉద్దేశించినది. ఉద్యోగాలు మారుతున్నప్పుడు.. ప్రస్తుత సంస్థ నుంచి కొత్త సంస్థకు మన ఈపీఎఫ్‌ను బదిలీ కూడా చేసుకోవచ్చు. అయితే ఉద్యోగం వీడిన తర్వాత మీ ఈపీఎఫ్‌ను విత్‌డ్రా చేసుకోవాలనుకుంటే తప్పక రెండు నెలలు వేచి ఉండాల్సిందే. కాగా, నిబంధనల ప్రకారం ఈ సమయంలో నెల రోజులపాటు నిరుద్యోగులుగా ఉంటే వారి ఈపీఎఫ్ సొమ్ములో 75 శాతం, రెండు నెలలు ఉద్యోగం దొరక్కపోతే మిగతా ఆ 25 శాతం సొమ్మునూ ఉపసంహరించుకోవచ్చు. ఇక ఈపీఎఫ్ విత్‌డ్రాయల్స్.. మీ ఉద్యోగ కాలం, ఇతరత్రా ఆదాయ వనరుల ఆధారంగా వర్తించే పన్నులకు లోబడి ఉంటాయి. ఐదేండ్లు కాకముందే మీ పీఎఫ్ ఖాతా నుంచి సొమ్మును తీసుకోవాలనుకుంటే పన్నులు వర్తిస్తాయి. అలా కాకుండా ఫామ్ 31 ద్వారా మీ పాత సంస్థ నుంచి కొత్త సంస్థలోకి ఈపీఎఫ్ ఖాతాను బదిలీ చేసుకుంటే కొంత కాలం తర్వాత సీనియారిటీ పెరిగి పన్నుల నుంచి తప్పించుకోవచ్చు. మీ ఆధార్, పాన్, బ్యాంక్ ఖాతా వివరాలతో మీ యూనివర్సల్ అకౌంట్ నెంబర్ (యూఏఎన్)ను జత చేసుకుంటే ఆన్‌లైన్ విత్‌డ్రాయల్స్ సులభతరంగా ఉంటాయి.

ఆన్‌లైన్‌లో మీ ఈపీఎఫ్ ఉపసంహరణ ఇలా..

- తొలుత యూఏఎన్, పాస్‌వర్డ్‌ను ఉపయోగించి మీ యూఏఎన్ మెంబర్ పోర్టల్‌లోకి లాగిన్ అవ్వండి.
- 'ఆన్‌లైన్ సర్వీసెస్' ట్యాబ్‌పై క్లిక్ చేసి, మీకు అవసరమైన ఈపీఎఫ్ అడ్వాన్స్ విత్‌డ్రాయల్ ఫామ్‌ను పొందడానికి డ్రాప్-డౌన్ మెనూ నుంచి 'క్లెయిమ్ (ఫామ్-31, 19, 10సీ, 10డీ)' ఎంచుకోండి
- స్క్రీన్‌పై మీ సభ్యత్వ వివరాలు కనిపిస్తాయి. ఆ తర్వాత మీ బ్యాంక్ ఖాతా నెంబర్‌లోని చివరి 4 నెంబర్లను ఎంటర్ చేసి, 'వెరిఫై'పై క్లిక్ చేయండి. ఆపై మరింత ముందుకెళ్లేందుకు 'యెస్'పై క్లిక్ చేయండి.
- 'ఆన్‌లైన్ క్లెయిమ్ కోసం ప్రొసీడ్' ఆప్షన్‌పై క్లిక్ చేయండి.
- కొద్దిమేరకే నిధుల్ని తీసుకోవాలనుకుంటే 'పీఎఫ్ అడ్వాన్స్ (ఫామ్ 31)'ను ఎంచుకోండి.
- ఓ కొత్త ఫామ్ తెరుచుకుంటుంది. అందులో మీ అవసరాన్ని తెలియజేయాలి.
- సర్టిఫికేషన్‌పై టిక్ చేసి, మీ దరఖాస్తును సమర్పించాలి.
- ఈ సందర్భంగా మీరు నింపిన ఈపీఎఫ్ క్లెయిమ్ ఫామ్‌లో వివరాలకు అనుగుణమైన ధ్రువపత్రాలను జత చేయాల్సి రావచ్చు.
- ఒక్కసారి మీ విత్‌డ్రాయల్ విజ్ఞప్తి ఆమోదం పొందితే, మీ ఈపీఎఫ్ ఖాతా నుంచి నగదు మీరు సూచించిన బ్యాంక్ ఖాతాలో 15-30 రోజుల్లో జమవుతుంది.
- ఈ మేరకు మీ రిజిస్టర్డ్ మొబైల్ నెంబర్‌కు ఎస్ ఎంఎస్ వస్తుంది.

రాజడి

నామినీ పక్కాగా ఉండాలి

కేతన్ ఓ ప్రైవేట్ ఉన్నతోద్యోగి. హైదరాబాద్‌లోని బహుళజాతి సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. వయస్సు 45 సంవత్సరాలు. మొదట్నుంచీ అతనికి ఎలాంటి ఆరోగ్య సమస్యల్లేవు. కానీ ఒకరోజు ఉన్నట్టుండి హార్ట్ అటాక్‌తో మరణించాడు. తన పేరు మీద ఎల్ఐసీలో రూ.50 లక్షల ఇన్సూరెన్స్ పాలసీ, రూ.30 లక్షల విలువైన షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌తోపాటు రూ.70 లక్షల బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బాండ్లు ఉన్నట్టు తేలింది. కేతన్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. వాళ్లు మైనర్లు. తండ్రి సంపాదనపైనే ఆధారపడినవాళ్లు. అలాగే కేతన్ తల్లిదండ్రులిద్దరూ తనతోనే ఉండేవారు. వీళ్లకు అనారోగ్య సమస్యలూ ఉన్నాయి.



కేతన్ ఎప్పుడూ తన ఆఫీసు పనిపైనే దృష్టిపెట్టేవాడు. అందుకే నామినీ విషయంలో పెద్దగా శ్రద్ధ తీసుకోలేదు. కానీ హఠాత్తుగా చనిపోవడంతో వాటాల విషయంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. కాబట్టే నామినీ అంశాన్ని ఎవరూ తేలిగ్గా తీసుకోరాదని న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

అంతా నామినీలకేనా?..

నామినీగా ఎవరి పేరుంటే ప్రయోజనం వాళ్లకే ఉంటుందంటే కూడా సరికాదు. అసలైన హక్కుదారులెవరో గుర్తించి, వాళ్లకు లబ్ధి చేకూర్చేందుకు మాత్రమే నామినీ పాత్ర కీలకమవుతుంది. అందుకే కుటుంబ తగాదాలు, డబ్బుల కోసం గొడవలుపడి తిట్టుకోవడం కంటే నామినీల విషయంలో క్లియర్‌కట్‌గా ఒక లెక్కాపత్రాన్ని మనందరమూ తయారు చేసుకోవాలని న్యాయ నిపుణులు సలహా ఇస్తున్నారు. లీగల్‌గా ఆస్తి పత్రాలే రాయాల్సిన అవసరం ఉండకపోవచ్చు, ఒకవేళ ఏదైనా జరిగితే వాళ్ల పరిస్థితి ఏంటో కూడా గమనించి మనం ముందు జాగ్రత్తపడాలి. పైన చెప్పిన కేతన్ విషయంలో భార్యా పిల్లలకే మొత్తం డబ్బులిచ్చేస్తే, తల్లిదండ్రుల పరిస్థితేంటి?.. వాళ్ల బాగోగులు చూసే వాళ్లెవరు?.. కాబట్టి పెట్టుబడులు, ఆస్తుల కొనుగోళ్ల సమయంలో ఆచితూచి వ్యవహరించి, అందరికీ లాభం చేకూరేలా నిర్ణయాలు తీసుకుంటే.. ఎటువంటి ఇబ్బందులూ రావని అంటున్నారు.

కుటుంబ సభ్యులకు చెప్పండి

బ్యాంకుల్లో డిపాజిట్లు, షేర్లు, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు, ఇన్సూరెన్స్.. ఇలా ఏది చేసినాసరే కుటుంబ సభ్యులకు వాటి గురించి చెప్పడం ఉత్తమం. వాళ్లకు తెలియకపోతే మీరెన్ని పెట్టుబడులు పెట్టినా వృథానే అని మరువద్దు. మీ తదనంతరం మీవాళ్లు కోర్టులు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితిని తెచ్చిపెట్టవద్దు. సక్సెషన్, లీగల్ హెయిర్ సర్టిఫికెట్లు అవసరమవుతాయి. ఇందుకు చాలా కష్టపడాల్సి వస్తుంది. ఒక్కోసారి సమాచారమేదీ లేకపోతే ఇన్వెస్టర్ ప్రొటెక్షన్ ఫండ్‌కో, ఆర్బీఐ ఖాతాల్లోకో వెళ్లిపోయి మీ కష్టం బూడిదపాలవుతుంది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) వద్ద రూ.35,012 కోట్ల అన్‌క్లెయిమ్డ్ డిపాజిట్లున్నాయంటే నామినీకున్న ప్రాధాన్యతను మీరే అర్థం చేసుకోవచ్చు. అందుకే నామినీ పేరు తప్పక సూచించండి. ఆ పేరు రాసే ముందు ఒకటికి రెండు సార్లు ఆలోచించి నిర్ణయం తీసుకోండి. బీమా సొమ్ముకు భార్య పేరును.. షేర్లు, పీపీఎఫ్, ఎన్‌పీఎస్, మ్యూచువల్ ఫండ్స్‌కు చదువుకునే పిల్లలను.. మనపై ఆధారపడిన తల్లిదండ్రులకు ఎఫ్‌డీలు అందేలా చర్యలు తీసుకుంటే ఉత్తమమని చెప్పవచ్చు. మొత్తానికి కుటుంబ పరిస్థితులనుబట్టి మనం బ్రతికున్నప్పుడే ఓ తెలివైన నిర్ణయం మాత్రం తీసుకోవాలి.

- నాగేంద్రసాయి కుందవరం

హోంలోన్ ఈఎంఐ తగ్గాలంటే..

రిజర్వ్ బ్యాంక్ సంవత్సరంన్నర క్రితం నుంచి మొదలుపెట్టి వరుస వడ్డీ రేట్ల పెంపుతో గృహ రుణాలపై నెలసరి వాయిదాల చెల్లింపు పెనుభారంగా మారింది. రెండేండ్ల క్రితం చెల్లించిన ఈఎంఐలకు ఇప్పుడు అదనంగా 20 శాతం చెల్లించాల్సి వస్తున్నది. ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ 2.5 శాతం మేర రేట్ల భారం మోపిన తర్వాత పెంపులకు బ్రేక్‌వేసిన ఆర్బీఐ తాజా సమీక్షలోనూ వడ్డీ రేట్లను యథాతథంగా అట్టిపెట్టింది. క్రమేపీ ద్రవ్యోల్బణం దిగివస్తున్న నేపథ్యంలో 2024 మార్చిలో అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్లకు కోతపెడితే భారత్‌లోనూ ఏప్రిల్‌లో తగ్గుతాయని, ఫెడ్ జాప్యం చేస్తే ఇక్కడ మరింత ఆలస్యం కావచ్చని విశ్లేషకులు అంటున్నారు. మొత్తంమీద వచ్చే ఏడాది ఆర్బీఐ వడ్డీ రేట్లు తగ్గించవచ్చన్న అంచనాలు బలంగా ఉన్నాయి. కానీ...రిజర్వ్ బ్యాంక్ తగ్గించినంత మాత్రాన గృహ రుణ వినియోగదారులందరికీ ఈఎంఐలూ వెంటనే తగ్గవు. గృహ రుణాల్ని బ్యాంకులు వివిధ రేట్లకు అనుసంధానించి ఇస్తుంటాయి. ఈబీఎల్ఆర్ (ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లింక్డ్ లెండింగ్ రేట్), ఎంసీఎల్ఆర్ (మార్జినల్ కాస్ట్ లింక్డ్ లెండింగ్ రేట్), బేస్ రేట్ లింక్ అయ్యి రుణాలు మంజూరవుతాయి.

భారం తగ్గించే రేటు ఇదే..

ఆర్బీఐ రెపో రేటుకు కోతపెడితే ఈబీఎల్ఆర్‌తో లింక్ చేసి మంజూరైన గృహ రుణాలపై వడ్డీ రేటునే బ్యాంక్‌లు వెనువెంటనే తగ్గిస్తాయి. ఈ రుణాలు తీసుకున్నవారికి తక్షణ ఊరట లభిస్తుంది. రెపో రేటు ఎంత తగ్గిస్తే ఆ మేరకు నేరుగా ప్రయోజనం కలుగుతుంది. ఈ నేపథ్యంలో మీరు తీసుకున్న రుణం ఈబీఎల్ఆర్‌తో లింక్ చేసిందో కాదో తెలుసుకోండి. లేకపోతే మీ గృహ రుణాన్ని ఈబీఎల్ఆర్‌కు మార్పు చేయమంటూ బ్యాంక్‌ను కోరండి. నామమాత్రపు ఫీజుతో బ్యాంక్ షిఫ్టుకు అనుమతిస్తుంది. ఉదాహరణకు ఒన్‌టైమ్ స్విచోవర్‌కు ఎస్బీఐ రూ.1,000 చార్జీ వసూలు చేస్తుంది. దీనికి పన్నులు అదనం.

ఎన్‌బీఎఫ్‌సీ రుణం అయితే

మీరు నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ నుంచి గృహ రుణాన్ని తీసుకున్నట్లయితే మాత్రం రేటు మార్పిడి కుదరదు. ఆర్బీఐ రేట్లు తగ్గించిన తర్వాత కొత్తగా తీసుకునేవారికి రేట్లను తగ్గించి ఇస్తూ, మీ ఈఎంఐలు తగ్గించకపోతే గృహ రుణాన్ని బదిలీ చేసుకోవడం ఉత్తమం. కొత్త రుణాలకు, మీ రుణానికి రేటు వ్యత్యాసం 0.5 శాతం లేదా అంతకు మించి ఉంటే మీ గృహ రుణాన్ని మరో రుణదాతకు బదిలీ చేసుకోండి. అయితే బదిలీకి అయ్యే వ్యయాన్ని, ఒనగూడే ప్రయోజనాన్ని మీరు చూసుకోవాలి. పలు బ్యాంకులు ప్రాసెసింగ్ ఫీజు రద్దుతో సహా వివిధ చార్జీలపై డిస్కౌంట్లు ఇస్తుంటాయి. మీ బదిలీ వ్యయాన్ని మరింత తగ్గించే బ్యాంక్ కోసం అన్వేషించండి.

ఓవర్‌బాట్ జోన్‌లో మార్కెట్

వరుసగా రెండోవారమూ బలమైన ర్యాలీ జరిపిన నిఫ్టీ మరో 701 పాయింట్లు లాభపడి 20,969 పాయింట్ల వద్ద ముగిసింది. రెండు వారాల్లో 1,179 పాయింట్లు పెరిగింది. వేగవంతమైన ర్యాలీ కారణంగా మార్కెట్ ఓవర్‌బాట్ జోన్‌లో పడిందని, ఇలాంటి స్థితిలో కరెక్షన్ జరిగిన సందర్భాలు గతంలో ఉన్నాయని జేఎం ఫైనాన్షియల్ టెక్నికల్ అనలిస్ట్ సోనీ పట్నాయక్ తెలిపారు. అయితే కరెక్షన్ సంకేతాలు అందేవరకూ ఇన్వెస్టర్లు అప్‌సైడ్ మూమెంటంలో పాలుపంచుకోవచ్చని చెప్పారు. మార్కెట్ భారీగా పెరిగినందున, ఇన్వెస్టర్లు జాగ్రత్త వహించాలని, రక్షణాత్మక రంగాలకు చెందిన ఎంపికచేసిన షేర్లను మాత్రమే కొనుగోలు చేయాలంటూ ఈక్విటీరీసెర్చ్. ఆసియా వ్యవస్థాపకుడు మిలన్ వైష్ణవ్ సూచించారు. నిఫ్టీ వీక్లీ చార్టులు అప్‌ట్రెండ్‌నే సూచిస్తున్నాయని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది చెప్పారు.

కీలక స్థాయి 21,000

ఈ వారం నిఫ్టీకి 21,000 పాయింట్ల స్థాయి కీలకమైనదని, ఆ స్థాయి వద్ద సూచి వ్యవహరించే తీరుపై తదుపరి ట్రెండ్ ఆధారపడి ఉంటుందని మిలన్ వైష్ణవ్ విశ్లేషించారు. ఈ స్థాయిని దాటి, పైన నిలదొక్కుకుంటే మరికొంత పెరిగే అవకాశం ఉంటుందని, లేకపోతే పరిమిత శ్రేణిలో కన్సాలిడేషన్ జరుగుతుందని తెలిపారు. నిఫ్టీకి 21,000పైన తదుపరి అవరోధం 21,265 పాయింట్ల వద్ద ఏర్పడవచ్చని, 20,700, 20,580 స్థాయిలు మద్దతుగా నిలుస్తాయని అంచనా వేశారు. 20,800 పాయింట్ల స్థాయిని బ్రేక్‌చేస్తేనే స్వల్పకాలిక కరెక్షన్ జరగవచ్చని, అప్పటివరకూ ర్యాలీ కొనసాగుతుందని సోనీ పట్నాయక్ వివరించారు. వీక్లీ చార్టుల ప్రకారం 20,500 మద్దతుస్థాయి కీలకమైనదని, ఈ స్థాయిపైన ఉన్నంతవరకూ అప్‌ట్రెండ్‌కు ప్రమాదమేదీ లేదని జిమిత్ మోది తెలిపారు. ఐటీ, రియల్టీ, బ్యాంకింగ్ రంగాల సూచీలు పటిష్ఠంగా ఉన్నాయన్నారు.

మార్కెట్ పల్స్

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.